ఊరంతా ఒకటే గుసగుసలు.

ఏమని?

శశి లేచిపోయిందని!

"ఎవరివెంట?" అన్నారు కొందరు.

"ఆమె లేచిపోయిందా? ఎవరయినా లేవదీసుకొని పోయారా?" అన్నారు తమకంటే వాకచక్యంగా మాట్లాడే వాళ్ళు, ఎవరూ లేరు అనుకొనే వాళ్లు.

"ఎన్నాళ్ళయినా పెళ్లిచేయకపోతేవయసొచ్చిన పిల్ల లేచిపోక ఏం చేస్తుంది?" అన్నారు ఇరుగుపొరుగు అమ్మలక్కలు.

"ఏం విపరీత కాలం!" అంటూ ముక్కుమీద వేలేసుకున్నారు కొందరు.

"హవ్వ...!" అంటూబుగ్గలునొక్కుకున్నారు మరి కొంతమంది.

"అదిగో పులి అంటే ఇదిగో తోక అనటమేనా?" అంది ఓ అమ్మాయి.

అంతవరకు వంతపాడిన వాళ్ళ ధోరణి మార్చి "శశి అలాంటి అమ్మాయి కాదు!" అన్నారు.

"మూడు కొవ్వులు ఒకటయితే ముల్లో కాలు ఏకమవుతాయి అని ఊరకే అన్నారా పెద్దలు?" అన్నాడు ఓ పెద్ద మనిషి.

రామనాథంగారి ఏకైక కుమార్తె శశి. తను పుట్టినప్పుడే తల్లిని పోగొట్టుకున్న దురదృష్టవంతురాలు. జబ్బు ముదిరి, బతుకుతానన్న ఆశ సన్నగిల్లినప్పుడు, "మీరు మళ్లీ పెళ్లి చేసుకున్నా అమ్మాయిని చదివించండి!" అని కోరిందట రామనాథం భార్య. 'అలాగేనని' భార్య చేతిలో చెయ్యి వేశాడట రామనాథం.

దివంగత భార్య ఆత్మక్షోభించకూడదన్న అభిప్రాయంతో అమ్మాయిని చదివించటానికి శాయశక్తులా కృషి చేశాడు రామనాథం. అయితే ఆర్థిక ఇబ్బందులవల్ల కుమార్తెను కాలేజీలో చేర్పలేకపోయాడు.

'ఆడది లేని ఇల్లు అడవి' అని ఎందుకంటారో భార్య మరణించిన కొన్నాళ్ళకే అర్థమయింది రామనాథానికి.

'తను దూర కంతలేదు మెడకొక డోలు' అన్నట్లు తల్లిలేని పసిపాపను ఎలాపోషించాలో రామనాథానికి పాలుపోలేదు.

శ్రేయోభిలాషులసలహాలుపాటించి పునర్వివాహం చేసుకున్నాడు రామనాథం.

రామనాథం గారి రెండో భార్య లక్ష్మి. లక్ష్మి రాకతో తన ఇంట్లో లక్ష్మి తాండవిస్తుందని కలలు కన్నాడు రామనాథం. అయితే కొన్నాళ్ళకే ఆ కలలు కల్లలయ్యాయి.

అదృష్టమో, దురదృష్టమో చెప్పలేం కానీ పెళ్ళయి పదేళ్లయినా లక్ష్మి తల్లి కాలేదు. శశిని తన బిడ్డగా భావించి ఆత్మీయంగా పెంచి పెద్దచేసింది.

మంచి సంబంధం చూసి శశికి పెళ్లి చేయాలని అనుకుంటూ ఉండగా ఆకస్మికంగా రామనాథానికి జబ్బుచేసింది. క్రమేపి ఆరోగ్యం క్షీణించి పక్షవాతంతో మంచం పట్టాడు రామనాథం. కూడబెట్టుకున్న సొమ్మంతా జబ్బు ఛార్జీలకు, డాక్టర్ల ఫీజులకు, మందులు కొనటానికే హారతి కర్పూరంలా హరించిపోయింది.

ఆనాడు శశి స్కూల్లో నేర్చుకున్న అల్లకం పని ఈనాడు కుటుంబానికి బతుకు తెరువు అయింది. ప్లాస్టిక్ వైరుతో బుట్టలు, బ్యాగ్‌లు అల్లి, వాటిని అమ్మి, వచ్చిన లాభంతో ముగ్గురూ బతుకుతున్నారు.

బుట్టలు, బ్యాగ్‌లు అమ్మటానికి రోజూ లక్ష్మి వెళ్ళేది. ఆనాడు ఏదో ఇబ్బంది వల్ల ఆమె వెళ్ళలేక శశిని ఒంటరిగా పంపించింది. ముందురోజువెళ్ళిన శశి మరునాడు తొమ్మిది గంటలయినా తిరిగి రాలేదు.

లక్ష్మి, రామనాథం రాత్రంతా నిద్రపోలేదు. ఆయన మనసు మనసులో లేదు. ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోసాగింది.

పెళ్లి విషయం జ్ఞాపకం రాగానే ఆ విషయం గురించి-అమ్మాయికి తనకు ఓ రోజు జరిగిన సంభాషణ జ్ఞాపకం వచ్చింది రామనాథానికి.

'మీ ఆరోగ్యం బాగులేనప్పుడు నా పెళ్ళి గురించి ఎందుకు ఆలోచిస్తారు నాన్నా!' అంది శశి.

'నేను కాక ఇంకెవరు ఆలోచిస్తారమ్మా?' అన్నాడు తను.

'ఆర్థిక స్తోమతలేనప్పుడు ఆలోచించి ప్రయోజనం ఏముంది నాన్నా?'

'అలాగని చేతులు ముడుచుకొని కూచుంటే పనులు జరుగుతాయా తల్లీ!'

'నా పెళ్ళికి ఇప్పుడు ఏం అవసరం వచ్చింది?'

ఇరవయ్యేళ్ల వయసు వచ్చినా పెళ్లిచేయక పోతే లోకం ఏమంటుందమ్మా?'

'ఎవరేమనుకుంటే మనకు వచ్చిన నష్టమేం? నా కాళ్ళమీద నేను నిల్చొగల అవకాశం ఉన్నప్పుడు జీవితాంతం అవివాహితంగా వుంటే తప్పేంవుంది?'

'అది లోక విరుద్ధం తల్లీ!'

"లోకంతో అవసరం లేదు. పెళ్ళి చేసుకొని మిమ్మల్ని కష్టాల పాలుచేయటం నాకు ఇష్టం లేదు"

....వయసులో ఉన్న అమ్మాయిని ఒంటరిగా పంపటం తనదే పొరపాటు....గత్యంతరం లేక పంపవలసి వచ్చింది...ఏం జరిగిందో ఇంతవరకు రాలేదు. తనకు తెలిసిన వాళ్ళ ఇంటికేమనయినా వెళ్లిందా...?

అసలు కాలం బాగులేదు... వర్షాల్లేక, చేయటానికి పనుల్లేక, ఉన్నా చేసే ఓపిక లేక సుఖంగా, దర్జాగా బతకాలన్న ధ్యాస ఎక్కువ కావటం వల్ల సమాజంలో దొంగలు ఎక్కువ అవుతున్నారు. దొంగలంటే వళ్లు జలదరించింది రామనాథానికి...ఆలోచన మరో మలుపు తిరిగింది.....బ్యాగ్ అమ్మిన డబ్బు కోసం దారిలో అమ్మాయిని ఎవరయినా అటకాయించి అఘాయిత్యం చేశారా..? మహా అయితే పాతిక, ముప్పయి రూపాయలు రావచ్చు. అంత తక్కువ మొత్తం కోసం అమ్మాయిని అటకాయించటానికి ఎవరు సిద్ధపడతారు?...ఏమో...చెప్పలేం...ముష్టి వాళ్ళు అడుక్కున్న చిల్లరకోసం కక్కుర్తిపడే వాళ్లున్నప్పుడు ఇరవై, ముప్పయి రూపాయల కోసం ఆశపడరని అనుకోటం అవివేకమే...! డబ్బు పోతే ఫరవాలేదు అమ్మాయి సురక్షితంగా ఇంటికి తిరిగివస్తే చాలు..."ఏడుకొండలవాడా! వెంకటేశ్వరా నువ్వేదిక్కు...!' అంటూ చేతులెత్తి నమస్కరించాడు.

"లక్ష్మీ...!" అంటూ భార్యను పిలిచాడు రామనాథం.

"ఏం, ఎందుకు అలా అరుస్తారు పెంకులు ఎగిరిపోయేలా?' అంది లక్ష్మి.

'అమ్మాయి ఇంకా రాలేదే!' అన్నాడు.

'బిగ్గరగా అరిస్తే వస్తుందా?'

'ఎక్కడకు వెళ్ళిందో, ఎలా వెళ్ళిందోనని ఆలోచించుకుంటూ కూచోటం కంటే అలా వెళ్లి వాకబు చేయటం మంచిది కదా? బయల్దేరండి వెళ్దాం!' అంది లక్ష్మి.

ఇద్దరు బయల్దేరి రిక్షాకోసం ఎదురు చూడసాగారు. ఇంతలో ఓ కారు వచ్చి ఇంటి ముందు ఆగింది. ఆ కారును చూసి కంగారుపడ్డారు దంపతులు ఇద్దరూ.

తల్లిదండ్రులు ఏర్పాటుచేసిన పెళ్లి చూపులకు ఎగనామం పెట్టి కాలేజీకి వెళ్లి వస్తానని వెళ్లిన రంగన్న కూతురు వర్ణాంతర వివాహం చేసుకొని, పెళ్ళి కుమారునితో బాటు కారులోవచ్చి తల్లిదండ్రులను ఆశ్చర్యం చకితుల్ని చేసిన సంఘటన వారి మెదడులో మెదిలింది.

ఏమీ నిర్ణయించుకోలేని సందిగ్ధావస్థ నుంచి తేరుకొనే లోగా డ్రయివరు దిగి కారు డోర్ తెరిచి, "దిగు అమ్మాయ్!" అన్నాడు.

ఆ దృశ్యం చూసి ఖంగ్ తిన్న రామనాథం అమ్మాయిని పలకరించబోయి, ఎందుకయినా మంచిదని మరోసారి ఆమెకేసి పరిశీలనగా చూశాడు తన కూతురో కాదోనన్న అనుమానంతో.

'ఏంటి తల్లీ ఇది' అంటూ శశిని వాటేసుకొని భోరుమంది లక్ష్మి.

శశి ఏమో చెప్పింది. అయితే ఆమాటలు వెక్కిళ్లతో కలిసిపోయాయి. అమ్మాయిని పొదివి పట్టుకొని లోనికి తీసుకెళ్లింది లక్ష్మి.

నలిగిపోయినలంగా,చిరిగిపోయినజాకెట్టు కందిపోయిన బుగ్గలు, బెదరిన నేత్రాల్ని చూసి, "ఏమయింది బాబూ మా అమ్మాయికి?" అంటూ ఆదుర్దాగా అడిగాడు డ్రయివర్ని.

'మండుతున్న ఎండలో బజారు-బజారు తిరిగి బ్యాగ్‌లు అమ్ముతున్న మీ అమ్మాయిని చూసి మా 'చినబాబు' కు జాలి కలిగి, బ్యాగ్‌లన్నీ తనకే కావాలని, అమ్మాయిని కార్లో కూచోబెట్టుకొని ఇంటికి పిలుచుకొని వచ్చారు. ఉన్నట్టుండి కళ్ళుతిరిగి అమ్మాయి కిందపడిపోయింది. డాక్టర్ని పిలిపించి ఇంజెక్షన్ ఏయించినారు. అమ్మాయికితెలివివచ్చిన తరువాత అడ్రసు అడిగి ఇంటివద్ద విడిచి రమ్మని కారుపంపినారు" అన్నాడు డ్రైవరు.

"మీ చినబాబు ఎవబాబూ?" అడిగాడు రామనాథం.

"ఎవరయితే నీకేం, నీ కూతుర్నిచ్చి పెళ్ళి చేద్దామనుకున్నావా?' అంటూ విసురుగా కార్లో కూచుని, గభాల్న డోర్ వేసుకొని, కారు స్టార్టు చేశాడు డ్రయివరు.

గుప్పున కొట్టిన నాటుసారాయి వాసన భరించలేక ముక్కు మూసుకున్నాడు రామనాథం. దుమ్ము రేపుకుంటూ కారుముందుకు సాగిపోయింది.

చినబాబుగారి చిరునామా తెలుసుకోవటంలో విఫలమయిన రామనాథం ఏమి చేయటానికి దిక్కుతోచక కనీసం కారు నంబరన్నా గుర్తుంచుకోవాలన్న ఉద్దేశంతో కారువెళ్ళిన వైపుచూశాడు. అప్పటికే మలుపు తిరిగి కనుమరుగైపోయింది కారు.

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 21-7-89